తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) వారి 1988 ఉగాది మినీ కథల పోటీలో
రు.300లు బహుమతి పొందిన కథ



# ట్రంకుపెట్టె

## కొండా కుసుమకుమారి

శివమ్మ కాపురానికొస్తూ తెచ్చుకుంది ఆ చిన్న ట్రంకు పెట్టె. ఆకుపచ్చ రంగు మీద నలుపు, గులాబీ రంగుల పూలు చిత్రించబడిన ఆ పెట్టె కొత్త పెళ్ళికూతురిలా కళకళలాడేది. అదంటే ఆమెకు పంచ ప్రాణాలు. దానిలో అపురూప మైనవన్నీ దాచుకొనేది. నాగరం, అడ్డిగ, రాళ్ళ బిళ్ళల్లాంటివన్నీ ఆ పెట్టెలో పెట్టుకుని తాళం వేసి తాళం చెవి కొంగుకు కట్టుకునేది.

ఇపుడు ఆ ట్రంకు పెట్టె గురించి చెప్పవలసిన సందర్భం వస్తే ఆమె కళ్ళనిండా వెలుగు వెల్లువై పొంగుతుంది. "నేను కాపురానికొచ్చేటప్పుడు మా పుట్టింటి వాళ్ళిచ్చిన పెట్టె అది. అప్పటి రేకు మందం, రంగు మన్నిక, నాణ్యత ఇప్పుడెక్కడ దొరుకుతుంది. మా నాన్న భీమవరంలో ఐదు రూపాయిలకు కొబోలు తెచ్చాడు. ఇప్పుడు వంద రూపాయిలు పోసినా దొరకదు సుమా" అంటుంది గొప్ప సంతోషంతో.

ఆ పెట్టె తెరచి వాడుకునే హక్కు ఆమె ఎవరికీ ఎప్పుడూ ఇవ్వలేదు. చివరకు భర్త కామయ్య కూడా బతికినన్ని రోజులూ ఆ పెట్టె తీసి చూసే సాహసం చేయలేదు.

పంట డబ్బొచ్చినా, దస్తావేజుల్లాంటి ముఖ్యమైన కాగితాలు జాగ్రత్త చేయవలసివచ్చినా "నీ పెట్టెలో దాచి పెట్టు శివం" అనేవాడు ఆమె చేతికిచ్చి.

"నా మీద కంటె మీ పుట్టింటి వాళ్ళిచ్చిన ఆ ట్రంకు పెట్టె మీదే నీకు ప్రేమ ఎక్కువ" అంటూ ఎగతాళి చేసేవాడు అప్పుడప్పుడు.

పిల్లలు చిన్న వాళ్ళుగా వున్నప్పుడు కుతూహలంతో పెట్టె దగ్గరకొస్తే ముట్టుకోకండ్రా రంగు పోతుంది" అంటూ కసురుకునేది.

పురుళ్ళకీ, పుణ్యాలకీ పుట్టింటికి వెళ్ళినా పెట్టె వెంట తీసుకునే వెళ్ళేది. ఎప్పుడు ఎక్కడున్నా ఆ పెట్టె వూసు మరచిపోయేది కాదు.

అలా ఆ ట్రంకు పెట్టె ఆమెకు ఆరోప్రాణం అయింది.

ఎంత పని హడావుడిలో వున్నా దాని తాళంచెవి ఎవరికీ తీసిచ్చేది కాదు. చివరకు కామయ్య పోయినప్పుడు ఓ మూల కూర్చుని కుమిలి పోతుంటే, ఎవరో అవసరం పడి తాళం చెవి అడిగితే ఆ పెట్టె ఇలా తీసుకు రండి తీసిస్తాను" అంది కళ్ళు తుడుచుకుంటూ.

విస్తుపోయిన అమ్మలక్కలు "మొగుడి కంటె ఆ పెట్టె మీదే ప్రేమెక్కువ" అనుకున్నారు తాళంచెవి ఇవ్వలేదన్న కసితో.

కాని నిజానికి పాతికేళ్ళు నిండకుండానే పసుపు కుంకుమలు చెల్లిపోవడం శివమ్మ జీవితంలో అతి విషాద కరమైన సంఘటన అయింది. కామెర్ల వ్యాధి ముదర డంతో అర్ధాంతరంగా పోయాడు కామయ్య. ఆ దారుణం ఆమె జీవితాన్నే మార్చేసింది. పూచిన తంగేడులా వుండే ఆమె మోడు బారిన చెట్టే అయింది.

గడపదాటి బయటకు రాని ఇల్లాలు భర్త పోవడంతో ఇంటికి ఆడదిక్కు మగదిక్కు తనే అయి పిల్ల లిద్దరినీ కష్టపడి చదివించింది. వున్న కాస్త పొలం సేద్యం చేసు కుంటూ పాడి గేదెల్ని పెట్టుకుని కోళ్ళు పెంచుతూ నానా విధాలుగా కష్టపడి పిల్లల్ని వృద్ధిలోకి తీసుకొచ్చింది. వాళ్ళ భవిష్యత్తు కోసం తెగ ఆరాటపడింది.

కష్టం ఫలించి కొడుకు లిద్దరికీ ఉద్యోగాలొచ్చాయి. ఉద్యోగాలతోపాటు కోడళ్ళూ వచ్చారు.

కాని ట్రంకు పెట్టెను మాత్రం వదిలి పెట్టలేదు శివమ్మ. పైపెచ్చు దానికి మరింత హత్తుకుపోయినట్ట యింది.

కొడుకులు విసుక్కునేవారు-"ఏం బంగారం దాచావని ఆ పెట్టెలో. ఏది కావాలన్నా మవ్వొచ్చి ఇవ్వవలసిందేకాని మేం తీయకూడదా!" అంటూ-

శివమ్మ నవ్వి వూరుకునేది.

కోడళ్ళకి మాత్రం గొప్ప కుతూహలం వుండేది ఆ పెట్టె గురించి. దానిలో ఏముందో చూడాలన్న పంతం కూడా వుండేది. కాని ఎన్నివిధాలా ప్రయత్నించినా ఆ తాళంచెవి మాత్రం వాళ్ళ చేతికి చిక్కలేదు.

అక్కసుతో ముసిల్దానికెంత కాపీనమో. తీసి చూపిస్తే సొమ్మేం పోయిందట. రేపు చచ్చాక వున్నదంతా కట్టుకు పోతుందా!" అనుకుంటూ తిట్టుకునే వాళ్ళు ఆమెను.

ఇంకా కోపమొస్తే "మామగారుండగా అడ్డగ వుండేదట. రాళ్ళ దిద్దులు, చంద్రహారం వుండేవట. పంట డబ్బు తీసికొచ్చి మహానుభావుడు చేతిలో పోసేవాడట. ఆ సొమ్మంతా ఏమైంది? కొడుకుల్ని వెర్రి వెంగళప్పల్ని చేసి వున్నదంతా మూటగట్టుకోకపోతే ఏమైనట్టు? డబ్బు మీద అంత ఆశలేని దానివైతే పెట్టె తీసి చూపించవచ్చుగా!" అంటూ రెచ్చగొట్టేవాళ్ళు.

శివమ్మ మాట్లాడేది కాదు.

కొడుకు కోడళ్ళు ఎంత నిలదీసినా నిమ్మకు నీరెత్తినట్టు వుండేది కాని పెదవి విప్పేది కాదు.

కాలక్రమంలో శివమ్మ జీవితంలో అనేకానేక మార్పులొచ్చినట్లే ఆమెలో కూడా ఎంతో మార్పు వచ్చింది. చూపు, తగ్గి నడుం ఒంగి, శరీరం పటుత్వం క్షీణించింది. అయినా పెట్టె మీద మక్కువ మాత్రం తరగలేదు.

ఇప్పుడా ట్రంకు పెట్టె తన యజమానురాలి లాగానే

# మృత్యువు

శూన్యం నించి ఏదో ఉద్భవిస్తుందనుకుంటే
అది వట్టి భ్రమ
చీకటి వెంజీకటే అవుతుంది
చిరు వెలుగు రేఖ వెల్లువై
వెలుగులు విరజిమ్మదు
కాలానికి కాళ్ళు విరక్కొట్టి
ఆలింగనం చేసుకుంటున్న మృత్యువును
ఎదురుగా వెనక్కు తోసేద్దామనుకోవడం
అనాదిగా మనిషికి పుర్రెలో తొలుస్తున్న కోరిక
ఆవహించిన శూన్యం అనంతం
కాలం ఒక ఆక్టోపస్
మృత్యువు అనివార్యం
చిరశాంతి నిలయం
తుది విశ్రాంతి సౌధం

—వాణీరంగారావు

పూర్వపు వైభవాన్ని, అందాన్ని కోల్పోయి శిథిల శిల్పంలా రంగు వెలిసి, తుప్పుపట్టి ఒకటి రెండు చోట్ల చొట్టలు పడి పరమ వికారంగా తయారైంది.

అయినా కురూపి అయిన బిడ్డను తల్లి మరింత ఆప్యాయతతో అక్కున చేర్చుకున్నట్టు శివమ్మ దాన్ని క్షణం వదిలేది కాదు.

ఒంటరిగా వున్నప్పుడు పెట్టె తెరచి దానిలో దాచుకున్న సంపదను అపురూపంగా చూసుకుంటూ ఆప్యాయతతో తడుముకునేది.

కోడళ్ళు ఆ పెట్టె కంట పడితేనే విసుక్కునే వాళ్ళు.

"ఆ దిక్కుమాలిన పెట్టె అవతల పారెయ్యండి. ఎవరైనా చూస్తే ఎంత అసహ్యించుకుంటారో! ముష్టి వాడికి దానం ఇచ్చినా పుచ్చుకోడు" అంటూ-

మనవాళ్ళు పకపక నవ్వేవాళ్ళు ఎగతాళిగా.

వాళ్ళు వున్నన్ని రోజులూ ఆ పెట్టెను ఏ మూలో దాచుకునేది ఆమె.

కాలం ఎల్లప్పుడూ ఒక రీతిగా నడవదు.

శివమ్మ మంచాన పడింది. కబురు తెలుసుకుని కొడుకులు, కోడళ్ళు ఒక్క పరుగున వచ్చారు.

ఆ వచ్చింది ఆమె మీద ప్రేమతో కాదు. ఇప్పటికైనా ఆ దిక్కుమాలిన ట్రంకు పెట్టె తెరచి చూడవచ్చన్న ఆశతో.

ఇంట్లో అడుగు పెడుతూనే పెట్టె కోసం నాలుగు మూలలా చూసారు. ఎక్కడా కనిపించలేదు.

శివమ్మ పడుకున్న మంచం క్రింద వుందది.

సణుక్కుంటూ, గొణుక్కుంటూ ఆమెకు చేయవలసిన సపర్యలన్నీ చేసారు. డాక్టర్లు మందులు, ఇంజక్షన్లకంటూ బోలెడు ఖర్చయింది. అయినా శివమ్మ కోలుకోలేదు.

చివరకు పెద్ద కొడుకు తల్లి దగ్గరకు చేరి "అమ్మా! మేం తెచ్చినదంతా అయిపోయింది. తాళంచెవి ఇస్తే పెట్టెలో ఏమైనా డబ్బుందేమో చూస్తాను" అన్నాడు.

ఎండిన కట్టెలా వున్న ముంజేతిని అతి ప్రయత్నం మీద కొద్దిగా పైకి లేపి లేదన్నట్లు సైగ చేసింది.

పళ్ళు నూరుకున్నాడు.

ఎవరైనా పెట్టె బర్రున లాగితే ఎంత మగతలో వున్నా ఉలిక్కిపడి కళ్ళు తెరిచేది. లోతుకు పోయిన ఆ కళ్ళల్లో భయం, ఆత్రుత రెపరెపలాడేవి.

'హు! ముసిల్దాని ప్రాణమంతా ఈ తుప్పుపట్టిన పెట్టె మీదే వుంది. రేపు చచ్చాక ఆ కట్టెతోపాటు ఈ పెట్టె తగలెయ్యాల్సిందే అనుకున్నారంతా నిర సనగా.

పది రోజులు గడిచాయి. కొద్ది కొద్దిగా కోలుకున్నట్టు కనిపించిన శివమ్మ ఓ ముహూర్తాన గుప్పున ప్రాణం వదిలింది.

ఆమె కాయాన్ని క్రింద పెట్టడం మరచి పెట్టె లాగారు మంచం క్రింద నుండి ఇవతలకు.

తెలియని ఆరాటంతో గుండెలు వేగంగా కొట్టుకుంటుంటే ఆమె కొంగుకు భద్రంగా కట్టబడిన తాళంచెవి తీసి పెట్టె తెరిచారు ఆత్రంగా.

డబ్బు కట్టలు, బంగారపు నగలు జిగేలుమంటూ మెరుస్తూ కళ్ళకు లక్ష్మీ ప్రసన్నం కలగజేస్తుందనుకుంటున్న తరుణంలో ముఖాన నీళ్ళు కొట్టినట్టు అదిరిపడ్డారంతా.

పెళ్ళినాటి చమ్కీ దండలు నలిగి నల్లబడి ఓ మూల కుప్పగా పడి వుంటే మరో పక్క చిరిగి పాత బడిన పెళ్ళి పట్టు బట్టలు-వాటిపై పసుపు కుంకుమలతో పాటు మంగళ సూత్రాలు, నల్ల పూసలు, మెట్టెలు, ఎండిన పూలు-మనసు గదిలాంటి ఆ ట్రంకు పెట్టెలో అపురూపమైన భావాల్లాంటి అమూల్య సంపద సాక్షాత్కరించింది.

తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) వారి బహుమతి పొందిన కార్టూను

